30-06-2025
సోమవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 270 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి




నిజామాబాద్ పసుపు రైతుల దశాబ్దాల కల నెరవేరింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పసుపు బోర్డును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ.. పసుపు రైతుల 40 ఏళ్ల కలను ప్రధాని మోదీ నెరవేర్చారన్నారు. తెలంగాణ పసుపు రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. 2030 నాటికి ఒక బిలియన్ డాలర్ల విలువైన పసుపును ఎగుమతి చేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ పసుపుకు రాజధాని లాంటిదని అమిత్ షా అన్నారు.

# నెరవేరిన రైతుల చిరకాల కల

- నిజామాబాద్‌లో 'పసుపు బోర్డు' ప్రారంభించిన అమిత్ షా
- పసుపు రైతుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని హామీ
- 'పసుపు ఒక దివ్య ఔషధం'

**జయభేరి, నిజామాబాద్ :**

దశాబ్దాల పోరాటం తర్వాత నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు కల ఎట్టకేలకు సాకారం అయింది. నిజామాబాద్ పసుపు రైతులు దాదాపు 40 ఏళ్లుగా పసుపు బోర్డు కోసం పోరాడగా.. ఈ ఏడాది జనవరి 14న కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటుపై అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ ఈ బోర్డును వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం భవనం నిర్మాణం జరిగి పూర్తి స్థాయిలో నిజామాబాద్‌లోని వినాయక నగర్‌లో కొలువు దీని పసుపు బోర్డును.. ఆదివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన అమిత్ షా.. పసుపు రైతుల 40 ఏళ్ల కలను ప్రధాని నరేంద్ర మోదీ నెరవేర్చారన్నారు. అంతేకాకుండా తెలంగాణ పసుపు రైతల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నిజామాబాద్ పసుపుకు రాజధాని లాంటిదని ఆయన కొనియాడారు. ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్,

...మిగతాది 2 లో

# హైదరాబాద్ ప్రజలకు గుడ్‌న్యూస్



హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ, హెచ్ఎండీఏ మధ్య ఒప్పందం కుదిరింది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి షామీర్‌పేట, డైరీ ఫామ్ వరకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తారు. ఇందుకుగానూ రక్షణ శాఖ 65 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇస్తే, ప్రభుత్వం 435 ఎకరాలు రక్షణ శాఖకు కేటాయించనుంది. ఈ కారిడార్లు పూర్తయితే ఉత్తర తెలంగాణ జిల్లాలకు వెళ్లేవారికి ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గుతాయి.

- ఇక ఆ రూట్లలో ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే
- రక్షణ శాఖ, తెలంగాణ ప్రభుత్వం కీలకల ఒప్పందం
- షామిర్‌పేట్, డెయిరీ ఫాం కారిడార్ల నిర్మాణంలో కీలక ముందడుగు

**జయభేరి, హైదరాబాద్ :**

భాగ్యనగర ప్రజలకు శుభవార్త. నగర ప్రజల చిరకాల స్వప్నమైన ట్రాఫిక్ రహిత ప్రయాణం దిశగా మరో ముందడుగు పడింది. నగరంలో దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కీలక ఒప్పందం జరిగింది. దీంతో నగరంలో చేపట్టనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల పనులు ఇక చకచకా పరుగులు పెట్టనున్నాయి. ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో అత్యంత కీలకమైన రక్షణ శాఖ భూముల బదలాయింపు ప్రక్రియ పూర్తయ్యింది. నగరంలో రెండు ఎలివేటెడ్ కారిడార్ల పనులు వేగవంతం చేసేందుకు శనివారం కీలక ఒప్పందం కుదిరింది. రక్షణ మంత్రిత్వ శాఖ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానిక మిలిటరీ అథారిటీకి, రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహించే హైదరాబాద్

...మిగతాది 2 లో

# అన్నదాత సుఖీభవ డబ్బులు పడేది అప్పుడే..

అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదలపై సీఎం నారా చంద్రబాబు నాయుడు క్లారిటీ ఇచ్చారు. మంగళగిరిలోని పార్టీ ఆఫీసులో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు.. వివిధ అంశాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత నిధుల విడుదలపై క్లారిటీ ఇచ్చారు. జులై నెలలో పీఎం కిసాన్ యోజనతో నిధులు విడుదల చేసిన రోజే.. అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు రైతుల బ్యాంక్ అకౌంట్లలో జమచేస్తామని చంద్రబాబు వెల్లడించారు.



**జయభేరి, మంగళగిరి :**

ఏపీలోని రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అన్నదాత సుఖీభవ పథకం నిధుల విడుదలపై క్లారిటీ వచ్చేసింది. అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందించనుంది ఏపీ ప్రభుత్వం. అయితే అన్నదాత సుఖీభవ తొలి విడత నిధుల

...మిగతాది 2 లో

# వాట్సాప్ గ్రూపు రాజకీయాలు



# భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ .. ఆరోగ్యానికి సరికొత్త రుచి..

- మిల్లెట్ బిస్కెట్లు తయారు చేస్తున్నారని..
- భద్రాచలం మహిళలను ప్రశంసించిన ప్రధాని మోదీ..

**జయభేరి, న్యూ డిల్లీ జూన్ 29:**

భద్రాచలం గిరిజన మహిళల స్ఫూర్తిదాయక కృషిని ప్రధాని మోదీ కొనియాడారు. 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరుతో వారు తయారుచేస్తున్న మిల్లెట్ బిస్కెట్లు దేశ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని, ఇది వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. అంతేకాకుండా, మూడు నెలల్లో 40 వేల శానిటరీ నాప్‌కిన్‌లను తయారు చేసి విక్రయించడం వారి ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని ప్రశంసించారు. ఈ కార్యక్రమాలు మహిళా సాధికారతకు ఉత్తమ ఉదాహరణగా నిలుస్తాయని మోదీ పేర్కొన్నారు. భద్రాచలం గిరిజన మహిళల స్ఫూర్తిదాయక కృషిని ప్రధాని నరేంద్ర మోదీ 123వ మన్ కీ బాత్‌లో ప్రత్యేకంగా అభినందించారు. స్వయం సహాయక బృందాల ద్వారా సాధించిన వారి విజయాలను దేశానికి చాటి చెప్పారు. ఇది కేవలం ఆర్థిక సాధికారతకు మాత్రమే కాకుండా.. సామాజిక మార్పుకు కూడా దారితీసిందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ తన ప్రసంగంలో.. తెలంగాణలోని భద్రాచలం ప్రాంతానికి చెందిన ఆదివాసీ మహిళలు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరుతో మిల్లెట్ బిస్కెట్లు తయారు చేస్తున్న విధానాన్ని కొనియాడారు. సంపూర్ణ ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడతాయని, వాటి ప్రాముఖ్యతను ప్రజలకు చేరవేయడంలో ఈ మహిళల కృషి అభినందనీయమని ప్రధాని అన్నారు. ఈ బిస్కెట్లు కేవలం స్థానికంగానే కాకుండా.. దేశ విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయని వెల్లడించారు. ఇది స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు లభించవచ్చని, గిరిజన సమాజాల

...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## నెరవేరిన రైతుల చిరకాల కల

రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క.. ఎంపీలు ధర్మపురి అరవింద్, కె లక్ష్మణ్, పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ బోర్డు ఏర్పాటుతో నిజామాబాద్ పసుపుకు.. వరల్డ్ వైడ్‌గా మరింత ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పసుపు బోర్డును తన చేతుల మీదుగా ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు అమిత్ షా చెప్పారు. తెలంగాణ పసుపు రైతుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం బీజేపీ ఎంపీలు చేసిన కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంతేకాకుండా, ఈ బోర్డుకు చైర్మన్‌గా తెలంగాణ వ్యక్తి అయిన పల్లె గంగారెడ్డిని నియమించడం తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ఆయన వెల్లడించారు.

**'పసుపు ఒక దివ్య ఔషధం'**

పసుపు కేవలం ఒక పంట మాత్రమే కాదని, అది ఒక దివ్య ఔషధమని అని అమిత్ షా చెప్పారు. యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియా, యాంటీ క్యాన్సర్ లక్షణాలు ఇందులో ఉన్నాయని ఆయన వివరించారు. 2030 నాటికి ఒక బిలియన్ డాలర్ల విలువైన పసుపును ఎగుమతి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ బోర్డు ద్వారా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ ఇస్తామని, ఇక్కడి పసుపు పంటకు జియో ట్యాగింగ్ కూడా చేస్తున్నామని చెప్పారు. భారత్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులందరికీ ప్రయోజనం చేకూర్చడానికి కృషి చేస్తున్నామని ఆయన అన్నారు.

## హైదరాబాద్ ప్రజలకు గుడ్‌న్యూస్

మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ HMDA మధ్య ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన ఒక అవగాహన ఒప్పందం జరిగింది. ఈ మేరకు సికింద్రాబాద్ స్టేషన్ కమాండర్‌లో జరిగిన కార్యక్రమంలో రక్షణ శాఖ తరఫున.. తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా బ్రిగేడియర్ ఎస్ రాజీవ్, HMDA చీఫ్ ఇంజినీర్ రవీందర్ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా.. ప్యారడైజ్ జంక్షన్ (జింఖానా గ్రౌండ్స్) నుంచి షామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు వరకు (SH01 18.14 కి.మీ.), ప్యారడైజ్ జంక్షన్ నుంచి డైరీ ఫామ్ రోడ్ కారిడార్‌ను (NH44 5.32 కి.మీ.) అభివృద్ధి చేస్తారు. అందుకోసం ఈ ఒప్పందంలో రక్షణ శాఖ భూములు, రాష్ట్ర ప్రభుత్వ భూముల మార్పిడికి సంబంధించిన అంశాలను పొందుపర్చారు. కాగా, డెయిరీఫాం కారిడార్‌కు సంబంధించిన పనులను ఇప్పటికే గుత్తేదారు సంస్థకు అప్పగించారు. తాజాగా భూముల బదలాయింపు పూర్తవడంతో శామీర్‌పేట్ వైపు కారిడార్ పనులు కూడా త్వరలోనే మొదలు కానున్నాయి. ఈ రెండు కారిడార్లను హెచ్‌ఎండీఏ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పీపీపీ మోడ్‌లో నిర్మించనుంది. ఈ కారిడార్లు పూర్తైతే ఉత్తర తెలంగాణ పట్టణాలకు వెళ్లే వారికి సౌకర్యవంతంగా ఉంటంది. ఈ ఒప్పందం ప్రకారం 65.038 ఎకరాల భూమిని రక్షణ శాఖ.. తెలంగాణ ప్రభుత్వానికి ఇస్తుంది. దానికి బదులుగా.. తెలంగాణ ప్రభుత్వం.. రక్షణ శాఖకు 435 ఎకరాల భూమిని కేటాయిస్తుంది. ఈ భూ మార్పిడి ద్వారా ట్రాఫిక్‌ను గణనీయంగా తగ్గించడానికి.. నగరంలో అనుసంధానతను మెరుగుపరచడానికి, హైదరాబాద్‌లో మొబిలిటీని పెంచడానికి అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణానికి మార్గం సుగమమైందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే హైదరాబాద్ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు చాలా వరకు తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ ..

ఆర్థికాభివృద్ధికి ఇది ఒక మోడల్‌గా నిలవగలదని ప్రధాని మోదీ అభినందనలు వ్యక్తం చేశారు. మిల్లెట్లు, చిరుధాన్యాలు, వాటి పోషక విలువలు ఆరోగ్య ప్రయోజనాల కారణంగా ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. ఇవి గ్లూటెన్ రహితం కావడం, ఫైబర్ అధికంగా ఉండటం.. వివిధ ఖనిజాలు, విటమిన్లను కలిగి ఉండటం వల్ల ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా మారాయి. భద్రాచలం మహిళలు మిల్లెట్లతో బిస్కెట్లను తయారు చేయడం ద్వారా.. చిరుధాన్యాలను ఆధునిక ఆహార అలవాట్లకు అనుగుణంగా మారుస్తూ, ప్రజల్లో వాటి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. మిల్లెట్ బిస్కెట్లతో పాటు, భద్రాచలం మహిళలు కేవలం మూడు నెలల స్వల్ప వ్యవధిలో 40 వేల శానిటరీ నాప్‌కిన్‌లను తయారు చేసి విక్రయించారని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఇది వారి ఆత్మవిశ్వాసం, సామాజిక స్పృహకు నిదర్శనమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా గిరిజన తెగలలో.. మహిళల ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత పట్ల అవగాహన పెంపొందించడంలో ఈ కృషి ఎంతో కీలకమని ఆయన అన్నారు. ఈ రెండు కార్యక్రమాలు.. గిరిజన మహిళలు కేవలం శారీరక శ్రమతోనే కాకుండా, పారిశ్రామిక నైపుణ్యాలను పెంచుకుని, స్వయం సమృద్ధిని సాధించగలరని నిరూపించాయి. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చడమే కాకుండా.. మహిళా సాధికారతకు ఒక ఉత్తమ ఉదాహరణగా నిలిచింది. మన్ కీ బాత్ కార్యక్రమంలో ఈ ప్రస్తావన, దేశవ్యాప్తంగా ఇలాంటి మరిన్ని కార్యక్రమాలకు ప్రేరణనిస్తుందని ఆశిస్తున్నారు. ఈ సందర్భంగా.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) భారత్‌ను ట్రకోమా రహిత దేశంగా ప్రకటించిందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు.

## అన్నదాత.. డబ్బులు పడేది అప్పుడే..

విడుదలపై సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. జులై నెలలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల చేస్తుందన్న చంద్రబాబు.. పీఎం కిసాన్ యోజన నిధులతో కలిపి అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడిన చంద్రబాబు.. పీఎం కిసాన్ యోజన డబ్బులు విడుదల చేసిన రోజే అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు కూడా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామన్నారు. పీఎం కిసాన్ యోజన సాయాన్ని కేంద్రం మూడు విడతల్లో అందిస్తుందని.. అప్పుడే అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు కూడా జమచేస్తామని చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. మరోవైపు పీఎం కిసాన్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఏటా మూడు విడతల్లో రూ.6000 అందించనుంది. ఈ సాయానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14000 జతచేసి ఏటా అర్హులైన రైతులకు రూ.20000 మూడు విడతల్లో అందించనుంది. తొలి విడత నిధులు జూన్ నెలాఖరులో విడుదల చేస్తారని వార్తలు రాగా.. కేంద్రం పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల చేయలేదు. దీంతో ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ డబ్బులు విడుదల కూడా వాయిదా పడింది. జులై నెలలో విడుదల చేస్తామని చంద్రబాబు తాజాగా వెల్లడించారు. మరోవైపు ఆగస్ట్ 15 నుంచి ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్న సంగతి తెలిసిందే. దీనితో పాటుగా మరో కార్యక్రమం కూడా చేపట్టనున్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 500 పౌరసేవలను ఆన్ లైన్ ద్వారా అందిస్తున్న ఏపీ ప్రభుత్వం.. ఈ సేవలను మరింత పెంచాలని నిర్ణయించింది. ఆగస్ట్ 15 నుంచి 703 పౌర సేవలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పెంచి ఇస్తున్నామని చంద్రబాబు గుర్తు చేశారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని తిరిగి పట్టాలెక్కించామని.. పోలవరం ప్రాజెక్టు పనులను కూడా మొదలుపెట్టినట్లు వివరించారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో నారా చంద్రబాబు నాయుడు మరోసారి స్పష్టం చేశారు.

## దర్గాగా పార్క్ కబ్జా

- రంగంలోకి హైడ్రా
- మూడు గంటల్లో పార్క్ ను కాపాడిన వైనం

**జయభేరి, మేడ్చల్ :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల లో సర్వే నెంబర్ 218, 214లో ఉన్న రుక్మిణి ఎస్టేట్స్ కు చెందిన పార్కు 1200 గజాలలో వుంది. దాంట్లో సగానికి పైగా కబ్జా అయిపోయింది. తప్పుడు పత్రాలతో కబ్జా చేసారని స్థానికుల ఆరోపణ. # ఈ కబ్జాలు తొలగించాలని కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ముందు రుక్మిణి ఎస్టేట్స్ రెసిడెన్షియల్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది, అటునుంచి నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి హైడ్రా కమిషనర్ రంగనాథ్ కలసి ఇదే విషయాన్ని ఫిర్యాదు చేసారు. అయన వెంటనే జీహెచ్ఎంసి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ కు ఫోన్ చేసి ఆక్రమణలు తొలగించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బందితో కలసి రంగంలోకి దిని హైడ్రా గి ఆక్రమణలను తొలగించింది. పిర్యాదు అందిన మూడు గంటల్లో కూల్చివేతలు జరగడంలో స్థానికులు సంబరపడ్డారు.

# వాట్సప్ గ్రూపు రాజకీయాలు..

### తెలంగాణలో జోరుగా పోలీస్ స్టేషన్లోనే భూ తగాదాల పరిష్కారాలు

**తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఆయా నియోజకవర్గ పోలీస్ స్టేషన్లో విలేకరుల తాకిడి ఎక్కువగా కనిపిస్తోంది.. నిజానికి విలేకరులకు పోలీస్ స్టేషన్లో ఏం పని? అన్న విషయం పక్కన పెడితే.. ఎస్సై సీఐలతో తత్ సంబంధాలు ఏర్పాటు చేసుకొని ప్రతి చిన్న తగాదాలు తమ చేతివాటాన్ని నింపుకోవడానికి ఒక రిపోర్టర్ కార్డు మెడలో వేసుకొని దందాగా కొనసాగిస్తున్న వైనం తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్లో ఉదాహరణలుగా మారిపోతున్నాయి.. దీనికి తోడు ఏ బజారు కుక్క ఆ బజారులోనే మొరగాలి అన్నట్టుగా.. ఆయా నియోజకవర్గాల పరిధిలో వాట్సప్ గ్రూపు రాజకీయాలు జోరుగా కొనసాగిస్తున్నారు.**




తమకు ఇష్టం వచ్చిన వారిని వాట్సప్ గ్రూపులలో జత చేయడం తర్వాత నచ్చకపోతే తిరిగి డిలీట్ చేయడం వారి వంతు గా మారిపోతుంది.. వాట్సాప్ లోనే రిపోర్టర్ల గ్రూపులో ప్రతి ఒక్క నాయకుడు ఉంటాడు. నాయకుడు చెప్పిందే వేదం రిపోర్టర్లు అలా మారిపోతారు. వాట్సప్ లో ఎవరెవరున్నారు మన వాడెవడు పగవాడెవడు అంటూ తారతమ్యాలు లేక పెడుతూ తేడా విభేదాలను రెచ్చగొడతారు.. పెదవి విప్పితే తీపి కబుర్లు చెప్పే రిపోర్టర్లే గొంతుకులో విషయాన్ని నింపుకొని గ్రూపు రాజకీయాలు వాట్సాప్ తోనే షురూ మొదలు పెడతారు... ముఖ్యంగా తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల్లో ఈ తంతు జోరుగా కొనసాగుతోంది.

వాస్తవానికి వాట్సప్ వాడే విధి విధానాల్లో మొదట్లో ఎవరికి అంతగా తెలియకపోయినా రాను రాను సోషల్ మీడియా పుణ్యమా అని ప్రతిదీ వాట్సాప్ లో పంపడం రియల్ ఎస్టేట్ దగ్గర నుంచి పోలీస్ స్టేషన్ తగాదాలదాకా వాట్సఅప్ గ్రూపుల్లో ఫలానా వాడు మనవాడు ఫలానా వాడు మనవాడు కాదు వీడి దగ్గర నుంచి ఎంత రా పట్టుకోవచ్చు వాడు నీకు ఏమి ఇచ్చాడు వీడు అసలు డబ్బులు ఇచ్చాడా అన్న సంభాషణలతో కూడిన వాట్సాప్ గ్రూప్ రాజకీయాలు తెలంగాణ నిండా జోరుగా కొనసాగుతున్నాయి...

నిజానికి వాట్సాప్ ఈ యాప్ ను కనిపెట్టిన వాళ్లు మంచి కోసం ఉపయోగించుకోవాలన్న ఉద్దేశంతోటే ప్రతి సాంకేతిక పరిజ్ఞానాన్ని కనిపెట్టిన సైంటిస్టులు ఆలోచిస్తారు... కానీ లోకల్ అన్న ఒకే ఒక వాదనతో వాట్సప్ గ్రూపు రాజకీయాలను ఏర్పాటు చేస్తూ ఎంచక్కా పోలీస్ స్టేషన్ తగదా నుంచి నాయకుని రాజకీయ పరిణామాల దాకా పూర్తిగా వాట్సాప్ లోనే ప్రతి విషయాన్ని షేర్ చేస్తూ ఉంటారు... ఇక ఇది ఇలా ఉంటే ఏదైనా పోలీస్ స్టేషన్లో అధికారి మీద ఆరోపణ వచ్చినప్పుడు పదేపదే వాట్సఅప్ గ్రూపుల్లో నచ్చని వాళ్ళు పోస్ట్ చేస్తారు... కానీ నచ్చిన వాళ్ళు దాన్ని వెంటనే గ్రూపు అడ్మిన్ గా ఉండి తీసేస్తూ అవసరమైతే గ్రూపులో నుంచి తొలగిస్తారు... ఎందుకంటే వారికి అదొక్కటే చేయడం వచ్చు గనక... నిజానికి రిపోర్టర్ గా పనిచేస్తున్న వాళ్లు గ్రామస్థాయిలో గుర్తింపు నోచుకోని అభివృద్ధి పనులను వాటిపై ఒక కథ రాని రాయలేని రిపోర్టర్లు ఒక సెల్ ఫోన్ పట్టుకొని నేను జర్నలిస్ట్ అంటూ ఎంచక్కా కాసులు దండుకుంటూ పోలీస్ స్టేషన్లను తమ ఇంటి గడపలుగా వాడుకుంటారు... పలానా యేసయ్య నాతోని బాగా క్లోజ్ గా ఉంటాడు... నేను ఎంత చెబితే అంత... ఏదేమైనా మనం ఒక ఫోన్ చేస్తే మనకు టైం ఇవ్వాల్సిందే మనం చెప్పిన పని చేయాల్సిందే అంటూ ఆ రిపోర్టర్ చెప్పే మాటలు వింటే పోలీస్ స్టేషన్లో ఉన్నత పదవుల్లో ఉన్నత ఉద్యోగాల్లో డ్యూటీ నిర్వహిస్తున్న పోలీసు ఉన్నతాధికారులే ఆలోచించుకోవాలి... చట్టం మీద ప్రమాణం చేసి ఎంతో కష్టతరమైన ఉద్యోగాన్ని సంపాదించుకొని ఇలాంటి దొడ్డిదారి పనులు చేసుకోవడానికి అది యూనిఫామ్ వేసుకొని బుద్ధిలేని పనులు చేయడానికి వారికి మనసెట్లో ఒప్పుతుందో చదువు ఏం నేర్పిందో ఎవరికి వారే ఆలోచించుకోవాలి.

వాట్సప్ గ్రూపులో అన్ని విషయాలు పరిగణలోకి వస్తున్నాయి... రాజకీయాలు బిజినెస్ ఫ్రెండ్స్ ఫ్యామిలీసు ఇలా ఒకటేమిటి వాడుకున్నోడికి వాడుకున్నంత... వాట్సాప్ గ్రూపు రాజకీయాలు చూస్తే ఎవరికైనా దిమ్మతిరిగి పోవాల్సిందే... తమకు నచ్చిన వాళ్ళే ఆ గ్రూపులో మెంబర్ గా ఉంటారు.. గ్రూప్ అడ్మిన్ గా ఉన్న వ్యక్తికి నచ్చితేనే ఆ గ్రూపులో సంభాషణలు కొనసాగిస్తారు.. అంతేగాని గ్రూప్ అడ్మిన్ కి నచ్చని పనులు ఏమైనా చేశారు నిర్దాక్షిణ్యంగా గ్రూపు నుంచి తొలగించేస్తారు.. అసలు గ్రూపులో పెట్టమన్నది మన ఇష్టం కాదు తొలగించేయడము మనకు తెలియదు కానీ వారికి వారే రాజులు వారికి వారే సైనికులుగా మారిపోయి నియోజకవర్గంలో పోలీస్ స్టేషన్ నుంచి ఎమ్మార్వో దాకా పూర్తిగా అధికారులను తమ ఆధినములు పెట్టుకున్నట్టు ఫోజులు కొడతారు... ఎవరైనా పోలీస్ కేసు ఉంది అంటే ఆ ఎస్ఐ నాకు బాగా తెలుసు ఈ ఎమ్మార్వో తో నేను చెప్తే పని అయిపోతది అంటూ మాయ మాటలు చెప్పి జోబులు నింపుకుంటారు పక్క వారి కడుపుని కొడతారు...


ఇది ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి పది జిల్లాల్లో జోరుగా లోకల్ రిపోర్టర్ల దందా జోరుగా కొనసాగుతోంది.. దీనికి కేవలం వాట్సాప్ గ్రూపు రాజకీయాలు వాట్సాప్ గ్రూపు సంభాషణలు వాట్సఅప్ గ్రూపులు తమ వారు పగవారు అంటూ వేరు చేసే ఇలాంటి వాట్సప్ గ్రూపులో ఉన్నంతకాలం మానవుల్లో మానవత్వం పూర్తిగా కనుమరుగైపోయి పైసలిస్తేనే పని జరుగుద్ది అన్న రోజులు మన కళ్ళ ముందే కదలాడుతున్నాయి.. ఇంకెక్కడి మానవత్వం ఇంకా ఇక్కడ న్యాయం ఇంకా ఎక్కడ చట్టం... పుస్తకాల్లో అక్షరాలుగా దాగి ఉంటాయి తప్ప ఆచరణాత్మకంగా అవి అడుగులు పడవు...

ఇకనైనా తెలంగాణ రాష్ట్రంలో అన్ని నియోజకవర్గంలో ఉన్న పోలీస్ స్టేషన్లో రెవెన్యూ సిబ్బంది ఇలాంటి గ్రూపు రాజకీయాలను తరిమికొట్టేలా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు... ఇదిలాగే కొనసాగితే దోచుకున్నోడికి దోచుకున్నంత అన్న విధంగా మారిపోయి ప్రతి సమస్య డబ్బుతోనే ముడిపడి ఉంటుంది అన్న మాటను నిజం చేస్తూ పైసలు ఇస్తే ఒక తీర్పు పైసలు ఇవ్వకపోతే మరొక తీర్పు అన్నట్టుగా కేసులు ఎదుర్కోవాల్సి వస్తుంది అంటూ కేసులు పాలైన బాధితులు మొత్తుకుంటున్నారు..

అయ్యా మీ గ్రూపు రాజకీయాలు సల్లగుండ మొత్తానికి నచ్చితే ఒక విధంగా నచ్చకపోతే మరో విధంగా పెదవి పైనే తేనె పూసిన కత్తులు లాంటి మాటలు కాలనాగు విషం చిమ్మే మాటలు... ఎంతైనా లోకల్ రిపోర్టర్లు అంటే ఎంచక్కా దోచుకోవచ్చు దాచుకోవచ్చు కడుపునిండా తినొచ్చు గొంతుకు నిండా తాగొచ్చు.... ఎలా తాగుతారు ఎలా తింటారు అంటే అది అంతే అవసరం ఉన్నవాడి పొట్టను కొట్టడమే మన పొట్ట నింపుకోవడమే.... చి చి జర్నలిజం పేరు చెబితేనే సిగ్గు వచ్చేలా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో లోకల్ గా ఉండే వాట్సాప్ గ్రూపు రాజకీయాలే వీటికి నిదర్శనం...

# నిజం గడప దాటేలోగా... అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది!

- ప్రభుత్వ వార్షికోత్సవం సందర్భంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం
- నెల రోజుల పాటు ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యేలు, ఎంపీలకు చంద్రబాబు ఆదేశం
- ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై సర్వేలు చేయిస్తున్నా.. బాగోకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక



ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో ప్రతిపక్ష వైసీపీ పన్నుతున్న కుట్రలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా, నెల రోజుల పాటు ప్రజల్లో విస్తృతంగా పర్యటించాలని ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పరిశీలకులతో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు.

గతంలో తాము చేసిన తప్పులు పునరావృతం కాకూడదని చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. నిజం గడప దాటేలోగా... అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది... అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. "2014లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాం. కానీ, వాటిని ప్రజల్లోకి సరిగా తీసుకెళ్లలేకపోయాం, రాజకీయం మరిచిపోయాం. చాపకింద నీరులా టీడీపీపై అబద్ధాలను ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారు. వివేకానందరెడ్డి హత్యే దీనికి పెద్ద ఉదాహరణ. గుండెపోటు అని మొదట ప్రచారం చేసి, ఆ తర్వాత నాటకాలు ఆడి ప్రజల సానుభూతి పొందారు. కోడికత్తి డ్రామా, ఎన్నికల ముందు గులక రాయి డ్రామా వంటివి వారి కుట్ర రాజకీయాలకు నిదర్శనం. ఇలాంటి దుష్ప్రచారాలను తేలిగ్గా తీసుకోవద్దు. మనం చేస్తున్న మంచిని ఎంత బలంగా వివరిస్తామో, వారి కుట్రలను కూడా అదే స్థాయిలో ప్రజలకు వివరించాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండడం ప్రాముఖ్యతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "పనిచేయడం ఒక ఎత్తయితే, జనానికి అందుబాటులో ఉండటం మరో ఎత్తు. ప్రజల్లోకి వెళ్లడానికి ఎలాంటి నామోషీ వద్దు. చేసిన పనులతో పాటు, చేయలేని పనులకు గల కారణాలను కూడా వివరించాలి. ప్రజలకు ఎంత దగ్గరగా ఉంటే, వారు అంతగా ఆదరిస్తారు. లేదంటే నిర్మొహమాటంగా టాటా చెప్పేస్తారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన పనితీరు ఉండాలి" అని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును తాను నిరంతరం గమనిస్తున్నానని, వివిధ మార్గాల్లో సర్వేలు చేయిస్తున్నానని చంద్రబాబు వెల్లడించారు. "ప్రతి ఎమ్మెల్యేతో త్వరలోనే నేను స్వయంగా సమావేశమవుతాను. ఇప్పటికే నలుగురితో మాట్లాడాను. వారు చెప్పేది ఓపిగ్గా వింటాను. వారిలో ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకోవడానికి సమయం ఇస్తాను. మారితే సంతోషం, లేదంటే నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడను. వారసులైనా సరే, కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు ఉంటుంది. పని చేయకుండా పదవులు ఆశిస్తే కుదరదు, వారికో నమస్కారం పెట్టేస్తా" అని చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. పాలనలో ఏమైనా లోటుపాట్లు, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుని ముందుకు సాగుదామని చంద్రబాబు అన్నారు. "ప్రజలు మెచ్చాలి, కార్యకర్తలు ఆమోదించాలి. అదే మన లక్ష్యం. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోవద్దు. డబ్బులు పంచి ఎన్నికల్లో గెలవాలనుకోవడం బాధాకరం. గత ఎన్నికల్లో ప్రత్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసినా 11 సీట్లకే పరిమితమయ్యారు. డబ్బు అన్నివేళలా పనిచేయదు. మనం ఆదర్శవంతమైన రాజకీయాలు చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. సుస్థిర ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చంద్రబాబు అన్నారు. "2004, 2019లో టీడీపీ ఓడిపోవడం వల్ల రాష్ట్రం తిరోగమనం పట్టింది. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు నమ్మకంతో ముందుకొస్తున్నారు. ఏడాదిలోనే రూ.9.34 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా 8.50 లక్షల ఉద్యోగాలు వస్తాయి" అని తెలిపారు. పోలవరం, అమరావతి పనులు వేగవంతం చేశామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టిస్తున్నామని వివరించారు. సంక్షేమంలోనూ, అభివృద్ధిలోనూ తమ ప్రభుత్వం ముందుందని చంద్రబాబు పేర్కొన్నారు. "64 లక్షల మందికి పెన్షన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, డీఎస్సీ నోటిఫికేషన్, అన్నా క్యాంటీన్లు వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం. విధానాలు ఎంత బాగున్నా, వాటి అమలులో లోపాలుంటే ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో బాధ్యతగా పనిచేయాలి. 2029లో గెలుపే నా ప్రణాళిక. అందుకోసం కష్టపడి పనిచేయడం కాదు, స్మార్ట్‌గా పనిచేయాలి" అని చంద్రబాబు నేతలకు స్పష్టం చేశారు. రాజకీయ ముసుగు వేసుకున్న ఆర్థిక ఉగ్రవాదులు, రౌడీలతో రాష్ట్రానికి ప్రమాదమని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

# మీడియాపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య

- మహా న్యూస్ ఛానల్ పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి
- టీయూడబ్ల్యూజే (ఐజేయు) మఫీషియల్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి.శ్రీనివాస్ (పేపర్ శ్రీను)

**జయభేరి, షాద్ నగర్, జూన్ 29 :**

మీడియా పై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని ప్రభుత్వం తక్షణమే స్పందించి దుండగుల పై కఠిన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర మఫీషియల్ కమిటీ కన్వీనర్ గుదుపల్లి శ్రీనివాస్ (పేపర్ శ్రీను )డిమాండ్ చేశారు. ఆదివారం టియుడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో మహా న్యూస్ ఛానల్ పై జరిగిన దాడికి నిరసనగా షాద్ నగర్ పట్టణంలోని ముఖ్య కూడలిలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుడిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.... సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు నిరంతరం పాటుపడుతుంటే వీధి రౌడీల్లా వచ్చి మీడియా ఛానళ్లపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచిన జర్నలిస్టులపై దాడులు చేయడం ఒక పిరికిపంద చర్యగా భావిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా ఉన్న మీడియా పై దాడులు చేయడం సరికాదని హెచ్చరించారు. ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా వార్తలు వస్తే న్యాయపరంగా చర్యలు తీసుకోవాలి లేదా అందుకు కౌంటర్ ఇవ్వాలే తప్ప దాడులు చేయడం సరైన సంస్కృతి కాదని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చెక్కల శ్రీశైలం మాట్లాడుతూ... ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం సమాచార సేవ చేస్తున్న మీడియా రంగాలపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. మహా న్యూస్ ప్రధాన కార్యాలయం పై జరిగిన దాడి సంఘటనలు సభ్య సమాజంలో తలదించుకునేలా ఉన్నాయని, పత్రికా స్వేచ్ఛను హరిస్తే వాస్తవాలు వెలుగులోకి ఎలా వస్తాయని, వాస్తవాలను ప్రజలకు తెలియజేసే మీడియాపై దాడులు చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఎలక్ట్రానిక్ మీడియా షాద్ నగర్ డివిజన్ అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ.. ప్రతిపక్ష హోదాలో ఉన్న నాయకులు ప్రధాన పక్షానికి మంచి సలహాలు సూచనలు ఇచ్చి ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా పాటుపడాలి కానీ, వార్తా ప్రసార కథనాలను అడ్డంపెట్టుకుని మీడియా కార్యాలయాల పై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం దాడి చేసిన వారిని పట్టుకుని తీవ్రంగా శిక్షించాలని ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని పేర్కొన్నారు. దాడులు చేసినంత మాత్రాన వాస్తవాలు బయటకు రాకుండా పోవని, నిజాలు నిర్భయంగా బయటకు వస్తాయన్న విషయాలను ప్రతిపక్ష పార్టీల నేతలు గ్రహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) ప్రింట్ మీడియా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, జిల్లా కార్యదర్శి దన్నారం రమేష్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఆకుల శ్రీనివాస్, అల్వాల దర్శన్, విష్ణు, నీరటి శివకుమార్, ఫయాజ్, ఇలియాస్, సమీ, సలీం, సాబీర్, శ్రీకాంత్, కాజా సోయల్, శ్రావణ్ గౌడ్, మహమ్మద్ రియాజ్, కార్తీక్, రమేష్, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.






## లక్ష్మాపూర్ గ్రామంలో సామాజిక, శాంతి భద్రతలపై అవగాహన

**జయభేరి, శామీర్ పేట, జూన్ 29 :**

యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని శామీర్ పేట సీఐ శ్రీనాథ్ సూచించారు. లక్ష్మాపూర్ గ్రామంలో శామీర్ పేట పోలీసుల ఆధ్వర్యంలో సామాజిక మరియు శాంతి భద్రతల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనాథ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. యువత డ్రగ్స్ బారిన పడి తమ బంగారు భవిష్యత్ ను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఎవరైనా విక్రయించిన తమకు సమాచారం ఇవ్వాలని , వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అదేవిధంగా నేటి రోజుల్లో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగి పోతున్న నేపథ్యంలో వీటిపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింక్స్, ఫేక్ కాల్స్ పై జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ మోసాలకు గురైన వారు 1930 నంబర్ కు సమాచారం అందించాలని సూచించారు. ఇక గ్రామాల్లో శాంతి భద్రతల కోసం సీసీ కెమెరాలు ఎంతో ముఖ్యమని , ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బండి జగన్నాథం,మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ నాగరాజు,వీరేశం, సత్తయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

## హకింపేట్ క్రీడా పాఠశాలలో అట్టహాసంగా జరిగిన జూనియర్ బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలు

- జిల్లా నలు మూలల నుంచి పాల్గొన్న క్రీడాకారులు
- ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మెమోంటో తో అందచేత





**జయభేరి, శామీర్ పేట, జూన్ 29 :**

హకింపేట్ తెలంగాణ క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ అండర్ 10,12&14 బాల బాలికల అథ్లెటిక్స్ క్రీడా పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు వివిధ విభాగాలలో పాల్గొని తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ మాట్లాడుతూ పోటీలలో బాల బాలికలు పాల్గొనడం శుభ పరిమాణం అని, క్రీడలు దేహదారుఢ్యం తో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ శారీరక ధారుడ్యాన్ని పెంపొందించే క్రీడల వైపు ఆసక్తి కనబర్చాలన్నారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ తో, పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్ మెరిట్ సర్టిఫికెట్స్ అందచేసి అభినందించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు వచ్చేనెల 6 వ తేదీన వరంగల్ లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా తరపున పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, జాయింట్ సెక్రెటరీ ఆర్గనైజర్ కూరపాటి రాజశేఖర్, వివిధ పాఠశాలల క్రీడా ఉపాధ్యాయులు తిరుమల, సురేందర్, శేఖర్ రావు, సునీల్, గోపాల్ రావు, మరియు క్రీడాకారుల తల్లిదండ్రులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి

- మీ ఉడుత ఊపులకు,అక్రమ అరెస్ట్ లకు, మీ తాటాకు చప్పుళ్లకు అస్సలే బయపడేదే లేదు



**జయభేరి, దేవరకొండ :**

బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ....... అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. మీ ఉడుత ఊపులకు,అక్రమ అరెస్ట్ లకు, మీ తాటాకు చప్పుళ్లకు అస్సలే బయపడేదే లేదు అని ఆయన అన్నారు.మహా టీవీ చిన్న గ్లాస్ పగులుతేనే బాధడుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కేటీఆర్ పై అసత్య ప్రచారం చేసిన మహా టీవీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడ రేవంత్ రెడ్డి,అక్కడ చంద్రబాబు నాయుడు హైరానా చేస్తున్నారు అని ఆయన తెలిపారు.మహా టీవీ యాజమాన్యం కేటీఆర్ పై వ్యక్తిగతంగా ఆరోపణలు చేసింది అని ఆయన తెలిపారు.కేటీఆర్ తో పాటు వారి కుటుంబసభ్యుల పరువు తీసే విధంగా ప్రసారాలు చేశారు అని ఆయన అన్నారు.



## విద్యా హక్కు చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు తక్షణ చర్యలకు పిలుపు

- కేతావత్ బాబురామ్ నాయక్
- గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్
- విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్రంలో అనేక ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విద్యా హక్కు చట్టం (RTE2009)కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. ఈ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం పాటించకుండా, విద్యార్థులపై మానసిక ఒత్తిడిని కలిగించే విధంగా స్వచ్ఛందంగా సిలబస్ తయారు చేసుకుంటూ, విద్యను వ్యాపార వేదికగా మలుస్తున్నాయి. ప్రస్తుతం అనేక పాఠశాలలు సొంత పబ్లికేషన్ పుస్తకాలను బలవంతంగా అమ్ముతూ, వేల రూపాయలు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను ఖాతరచడం లేదు. కనీస విద్యార్హతలు లేని టీచర్లతో బోధన నిర్వహిస్తున్నారు. శౌచాలయాలు, మౌలిక వసతులు లేకుండా పిల్లల భద్రతను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ అనుమతి లేకుండానే తరగతులు నడుపుతున్నారు. ఇది పూర్తిగా విద్యా హక్కు చట్టానికి, విద్యార్థుల హక్కులకు వ్యతిరేకం. ఈ అంశంపై జాతీయ బాలల హక్కుల సంరక్షణ సంఘం (NCPCR) కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఏప్రిల్ 15న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసి, అన్ని పాఠశాలలు తప్పనిసరిగా NCERT/SCERT రూపొందించిన పాఠ్య పుస్తకాలను మాత్రమే పాటించాలని స్పష్టం చేసింది. ఎవరైనా తమ సొంత కోర్సులు అమలు చేస్తే, వారికి జువెనైల్ జస్టిస్ చట్టం కింద చర్యలు తీసుకోవాలని సూచించింది.ఈ సందర్భంగా కేతావత్ బాబురామ్ నాయక్ స్పష్టం చేశారు విద్య అనేది వ్యాపార దండగ కాదు. కార్పొరేట్ పాఠశాలలు పిల్లల భవిష్యత్తును లాభదండగగా మలుస్తూ, చట్టాలను ఉల్లంఘిస్తున్నాయి. ఇది అప్రజాస్వామికం. విద్యా శాఖ తక్షణ స్పందన ఇవ్వాలి." అదే విదంగా మా యొక్క ముఖ్య డిమాండ్లు. DEO మరియు RJD లాంటి సంబంధిత అధికారులపై సమగ్ర విచారణ జరపాలి. NCERT/SCERT పాఠ్యపథకాలను తప్పనిసరిగా అమలు చేయించాలని జిల్లా స్థాయి ఉత్తర్వులు ఇవ్వాలి. విద్యా శాఖ అన్ని జిల్లాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలి. ద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘించిన పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల హక్కులను ప్రాథమికంగా పరిరక్షించేందుకు ప్రత్యేక తనిఖీ బృందాలు నియమించాలి. ఈ సమస్యపై చర్యలు తీసుకోకపోతే, విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా చైతన్యం తీసుకురావడమే మా లక్ష్యం అని వారు అన్నారు.

## క్రియ శీలక సభ్యత్వం గుర్తింపు కార్డు నమోదు పత్రం కిట్లు అందజేత

- క్రియ శీలక సభ్యత్వం గుర్తింపు కార్డు నమోదు పత్రం కిట్లు అందజేత జనసేన పార్టీ నాయకులు బంజారా సినీ హీరో కోర్ర చందు నాయక్

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్ర నాయకులు ఆదేశాల మేరకు క్రియాశీలక సభ్యత్వం కిట్లు నాగార్జునసాగర్ జనసేన పార్టీ నాయకులు వాలింటర్ రామ్ వంశీ యాదవ్ కు దేవరకొండ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు చందు నాయక్ క్రియాశీలక సభ్యత్వం కిట్లు అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ కార్యకర్తలకు ఏదైనా ప్రమాదం జరుగుతే కార్యకర్తలు సభ్యత్వం తీసుకున్న వారికి ఐదు లక్షలు కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న విషయం తెలిసిందే కావున దానికి సంబంధించిన గుర్తింపు కార్డు నమోదు పత్రం సాగర్ నియోజకవర్గం తిరుమలగిరి సంబంధించిన కిట్లు జనసేన పార్టీ నాయకులు చందు నాయక్ అందజేయడం జరిగింది రానున్న రోజులో జనసేన పార్టీ సభ్యత్వాలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు కార్యకర్తల కోసం క్రియాశీలక సభ్యత్వం చేపట్టిన పవన్ కళ్యాణ్ కి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్ కి కోదాడ ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి కి దేవరకొండ నియోజవర్గ జనసేన పార్టీ నాయకుల తరపునుంచి ధన్యవాదాలు తెలియజేశారు దేవరకొండ నియోజకవర్గంలో త్వరలో కిట్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంలో జనసేన పార్టీ నాయకులు బంజారా సినీ హీరో చందు నాయక్ అన్నారు ఈ కార్యక్రమంలో నరేష్ శ్రీను శంకర్ జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాల సంఘం చైర్మన్ గా బోయిని ఎన్నిక

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 29 :**




తుర్కపల్లి మండల కేంద్రంలోని పాల సంఘం చైర్మన్ గా బోయిని కుమార్ ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా బోయిని మల్లేష్, బోయిని శ్రీహర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ పాల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, రైతులకు ఏ సమస్య వచ్చినా ఎల్లవేళలా ముందుండి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు .ఈ కార్యక్రమంలో పాల సంఘం మాజీ చైర్మన్ ముత్రాజ్పల్లి చంద్రం, బోయిని బాలయ్య, బోయిని రాములు, బోయిని కృష్ణ, బోయిని సత్తయ్య, బోయిని నరసయ్య, జివిలిక పల్లి శ్రీను, అరిగే మైపాల్, సోమల కరుణాకర్, పసుల కనకరాజు, బోయిని కైలాసం, సోమల సతీష్ పాల్గొన్నారు.

**గంధ మల్ల పాల సంఘం చైర్మన్ గా బొత్త రాములు ఎన్నిక**

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామ పాల సంఘం చైర్మన్ గా బొత్త రాములు ను 11వసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

**దయ్యం బండ తండ పాల సంఘం చైర్మన్ గా మహేందర్ నాయక్ ఎన్నిక**

తుర్కపల్లి మండలం దయ్యం బండ తండా గ్రామ పాల సంఘం చైర్మన్ గా రెండవసారి వాంకుడోత్ మహేందర్ నాయక్ ను ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా సుధాకర్, నరేందర్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలితా శ్రీనివాస్, మాజీ చైర్మన్ రాము నాయక్, మహేందర్, లక్ష్మణ్, లచ్చిరాం, నవీన్, లక్ష్మణ్ ,బిచ్చు, శ్రీనివాస్, రమేష్, పాల్గొన్నారు.

## నా గురువుల బోధనలే నన్నీ స్థాయికి చేర్చాయి

- ప్రభుత్వ విప్

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 29 :**




నా గురువుల బోధనలే నన్నీ స్థాయికి చేర్చాయని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలోని రంగా కన్వెన్షన్ హాల్లో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పల్లె స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రము) జక్కుల సుభాషిని రాజయ్యల ఉద్యోగ విరమణ అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, ఉపాధ్యాయులు చెప్పిన మాటలు విని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. 30 సంవత్సరాలు సుదీర్ఘంగా ఉపాధ్యాయ వృత్తిలో ఉండి అనేకమంది విద్యార్థులకు విద్యాదానం చేసిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందని అన్నారు. ఉపాధ్యాయులే పిల్లల మార్గదర్శకులని అన్నారు. వారు చెప్పిన మాటలు విని అభివృద్ధి పదములో నడిచి ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ధనావత్ శంకర్ నాయక్, కానుగు బాలరాజు గౌడ్, మాజీ ఎంపీపీలు చీర శ్రీశైలం, బోరెడ్డి రాంరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, నాయకులు దేవరుప్పల ఐలయ్య రాజారాం నాయక్, పని గట్ల సుదర్శన్, బొత్త రాములు, దొనికెన వెంకటేష్ యాదవ్, వల్లపు రమేష్, సోన్నాయిల రఘు, సింగం వెంకటేశం, బోరెడ్డి హనుమంత రెడ్డి, బోరెడ్డి మహిపాల్ రెడ్డి, పసుల సత్యనారాయణ ,టి పి యు ఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, శ్రీశైలం, రాధిక ,దుండిగల్ ఎంఈఓ కృష్ణ, గెజిటెడ్ హెచ్ఎంలు మంజూషారాణి ,బాలమణి, శ్రీనివాస్ ,రవీందర్ నాయక్, సత్యం, సుజాత, వివిధ సంఘాల నాయకులు మంజుల, విష్ణు, బిక్షమయ్య, మహేష్, మధుకర్, హారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో తెలంగాణ ఉద్యమ కారుల వాటా ఎంత?

✍ **జయభేరి, హైదరాబాద్, జూన్ 29:**



తెలంగాణ ఉద్యమ కారుల త్యాగాలతో ఉద్యమాలతో అమరవీరుల ఆత్మ బలిదానా లతో వచ్చిన తెలంగాణలో అన్ని రంగాల్లో ఉద్యమ కారుల వాటా ఎంత? తొలి దశ లో 369 మలిదశలో 1200 పైగా తెలంగాణ ఉద్యమ కారులు మరణించటం జరిగింది. వేల మంది తమ కుటుంబాలను పక్కన పెట్టి చేసే వ్యాపారాలను ప్రైవేటు ఉద్యోగాలను పక్కన పెట్టి విద్యార్థులు తమ చదువులను పక్కన పెట్టి తెలంగాణ రాష్ట్ర సాధన ధ్యేయంగా ఉద్యమించటం జరిగింది. మలిదశ ఉద్యమం లో ఏ పిలుపు నిచ్చిన విజయ వంతం చేయటం కోసం లాఠీ దెబ్బలు ను సహితం లెక్క చేయకుండా ఉద్యమించటం జరిగింది.జైలు జీవితాలు గడపటం జరిగింది.కుటుంబాల పోషణ కోసం చేస్తున్న పనులను సహితం వదిలి పెట్టి ఉన్న ఆస్తులను అమ్మి కొందరు అప్పులు చేసి కొందాం ఉద్యమాన్ని నడిపించటం జరిగింది.

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం.. వచ్చిన తెలంగాణ లో తెలంగాణ ఉద్యమ కారుల కి ఏమి వచ్చింది? ప్రతి ఉద్యమ కారుడు ఆత్మ విమర్శ చేసుకోండి. ఆత్మ బలిదానాలు చేసుకున్నది ఎవరు? లాఠీ దెబ్బలు తిన్నది ఎవరు? బుల్లెట్ గాయాలు అయింది ఎవరికి? కుటుంబాలను పక్కన పెట్టి తెలంగాణ రాష్ట్ర సాధన ధ్యేయంగా ఉద్యమం చేసింది ఎవరు? ఆస్తులు అమ్ముకొని అప్పులు చేసి ఉద్యమాలు చేసింది ఎవరు?చదువులు కొలువులు నష్ట పోయింది ఎవరు? ఉద్యమానికి నాయకత్వం వహించింది ఎవరు జండాలు మోసి జైళ్ల పాలయి.. అప్పుల పాలయి.. లాఠీ దెబ్బలు తిని బుల్లెట్ గాయాలు అయింది పెట్రోలు తో శరీరాలను కాల్చు కున్నది ఎవరు? వచ్చిన తెలంగాణలో ప్రజా ప్రతినిధులు అయింది అవుతుంది ఎవరు? విలాస జీవితాలను నేడు గడుపుతుంది ఎవరు? కనీసం కుటుంబ అవసరాలు కూడా తీర్చు కోలేని స్థితిలో దయనీయ స్థితిలో జీవిస్తుంది ఎవరు? ఇంకా జండాలు మోసే కూలీలు గా ఉన్నది ఎవరు? జల్సా జీవితాలు గడుపుతుంది ఎవరు? ఉద్యమ సమయంలో నాయకత్వం వహించిన నాయకుల ఆస్తులు ఎన్ని నేడు వాళ్ళ ఆస్తులు ఎన్ని? సినిమా రంగం విద్యా రంగం మీడియా రంగం కార్పొరేట్ రంగం అన్ని రంగాలలో ఎవరి ఆధిపత్యం ఉన్నది నేడు? ప్రజా ప్రతినిధులు గా ఎవరు అవుతున్నారు ? ఉద్యమ కారులా? ఉద్యమ ద్రోహుల? త్యాగాలు ఎవరివి భోగాలు ఎవరికి? చూస్తూ ఉందామా ? ఆలోచించండి తెలంగాణ ఉద్యమ కారులారా మన త్యాగాలతో ఉద్యమాలతో వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ కారుల దుస్థితి ను చూడండి. రాజకీయ రంగం లో అవకాశాలు లేవు పైసలు ఉన్న కార్పొరేట్ ఉద్యమ ద్రోహులు కే అవకాశాలు అన్ని పార్టీలలో నామినేటెడ్ పదవులు లలో అవకాశాలు తక్కువ ఉద్యమ కారులకి ఉద్యమ కారుల సంక్షేమం కోసం గొంతు ఎత్తే పార్టీలు కనపడటం లేదు. ఉద్యమ కారుల ద్వారా వచ్చిన తెలంగాణ లో ఉద్యమ కారుల సంక్షేమం గురించి ఆలోచించే రాజకీయ నాయకులు పిడికెడు మంది కూడా లేరు. గత 7 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మ గౌరవం సంక్షేమం కోసం మన తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ పని చేస్తుంది. తెలంగాణ ఉద్యమ కారుల కి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నాం.

ఒక కమిటీ ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమ కారుల ను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలి. సంక్షేమ పథకాలు లో 20 శాతం కోటా ఉద్యమ కారుల కి కేటాయించాలి. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు ను వెంటనే ఏర్పాటు చేయాలి. తెలంగాణ ఉద్యమ కారులారా తెలంగాణ ఉద్యమ కారుల హామీల అమలు కోసం జూన్ 30 సోమవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా శాంతి యుత దీక్షలు నిర్వహిస్తున్నాం ఈ దీక్షలు కు ప్రతి ఉద్యమ రాజకీయ నాయకులు నాయకురాలు ప్రజా సంఘాలు కుల సంఘాలు కవులు కళాకారులు సంఘీభావం ప్రకటించాలని కోరుతున్నాం. తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మ గౌరవం సంక్షేమం సామాజిక ప్రజాస్వామిక తెలంగాణ తెలంగాణ పునర్ నిర్మాణం మా లక్ష్యం.



## హరీష్ రావుకు ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ నాయకులు

- హరీష్ రావుతో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- స్వాగతం పలికిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, సమ్మె సత్యనారాయణ

✍ **జయభేరి, షాద్ నగర్, జూన్ 29 :**

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాంబాల్ నాయక్ గారి తండ్రి మూడవత్ గోప్య నాయక్ గారు మృతిచేందిన కారణంగా రాంబాల్ నాయక్ ని పరామర్శించడానికి వస్తున్న సందర్భంగా మాజీ మంత్రివర్యులు సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు గారికి తిమ్మాపూర్ ముఖ్య కూడలి వద్ద ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మె సత్యనారాయణ, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తనయుడు రామకృష్ణ, కొండారెడ్డిపల్లి మాజీ శేఖర్ పంతులు, పిఏసిఎస్ చైర్మన్ గొల్లపల్లి అశోక్, మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాల్ రాజ్ మహాదేవ్ పూర్ రవీందర్ రెడ్డి, గూడూరు మాజీ సర్పంచ్ సత్తయ్య, మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అజయ్,జంగిల్ కుమార్,బీ ఆర్ ఎస్ నాయకులు శివచారి, పద్మారావు, దినేష్ సాగర్, సుధీర్, గుట్ట రాజు, కాడాలా శ్రీశైలం, పెంజర్ల జైపాల్, అనిల్ గూడూరు సురేష్, గూడూరు గణేష్, నవాజ్ తదితరులు స్వాగతం పలికారు.

## బదిలీపై వెళ్తున్న మహిళ ఎస్.ఐ ను సన్మానించిన పోలీసులు..

- శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించిన ఎస్.ఐ. హారిక..
- ఇటీవలే శంషాబాద్ కు బదిలీ..
- హారిక శామీర్ పేట్ ప్రజలకు అందుబాటులో ఉండి అందించిన సేవలు మరువలేనివి..
- అందరి హృదయాల్లో మర్చిపోని ముద్రవేసిన మహిళా అధికారిణి



✍ **జయభేరి, శామీర్ పేట్, జూన్ 29 :**

విధి నిర్వహణలో భాగంగా ఏ మాత్రం వెనకడుగు వేయకుండా నిత్యం రాత్రి పగలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించిన ఎస్.ఐ. హారికను షామీర్ పేట్ సిఐ శ్రీనాథ్, ఎస్.ఐ సోమిరెడ్డి, ఏ.ఎస్.ఐ రమేష్, సిబ్బంది కలిసి శాలువాతో సన్మానం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు.. అనంతరం శామీర్ పేట్ సీఐ శ్రీనాథ్ మాట్లాడుతూ.. హారిక శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు, ప్రజలతో సానుకూలంగా మాట్లాడి సమస్యలు పరిష్కారం చేస్తూ అందరి హృదయాలలో మంచి స్థానం దక్కించుకుంది అన్నారు.. అనంతరం ఎస్ఐ హారిక మాట్లాడుతూ నాకు మొదట పోస్టింగ్ మాదాపూర్ లో వచ్చింది.. ఆ తర్వాత షామీర్ పేట్ కు బదిలీ అయ్యాను.. మొదట నగర శివారు ప్రాంతం కదా ఎలా ఉంటుందొ అన్ని కొంచెం కంగారు పడ్డాను.. కానీ ఇక్కడ ఉన్న స్టాఫ్, స్థానిక ప్రజలు వారి మంచితనాన్ని ఎప్పటికీ మరువలేను.. నిజానికి ఈ పోలీస్ స్టేషన్ వదిలి వెళ్లాలంటే చాలా బాధగా ఉంది.. అయినా సరే ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించవలసిన బాధ్యతగా శంషాబాద్ కు వెళ్తున్నానని తెలిపారు.. కాగా బదిలీపై వెళ్తున్న ఎస్.ఐ హారిక అతి తొందరలో సీఐగా బాధ్యతలు తీసుకొని మళ్లీ ఇదే పోలీస్ స్టేషన్ కు రావాలని షామీర్ పేట్ మండల ప్రజల తోపాటు పోలీస్ సిబ్బంది కోరుకున్నారు.



## ఆరోగ్యం, పౌష్టికాహారం పై అవగాహన కార్యక్రమం




✍ **జయభేరి, తుర్కపల్లి, జూన్ 29 :**

స్వయం సహాయక సంఘం, గ్రామ సంఘం నిర్వహణ, వివిధ ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం పౌష్టికాహారం పై పూర్తి అవగాహన కార్యక్రమాన్ని తుర్కపల్లి మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 35 గ్రామ సంఘాల్లో నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ సంఘం పదాధికారులు, అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారిలకు వారి యొక్క విధులు, బాధ్యతలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి పాల్గొని పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిఆర్పిలు జిల్లా ఐబి ఏపిఎం మల్లేశం, మండల ఏపీఎం చంచల యాదగిరి, సీసీలు పరుశరాములు, శివకుమార్, అకౌంటెంట్ లక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ షాహిన్, పదాధికారులు, అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, మహిళలు పాల్గొన్నారు.

## తోటి ఉద్యోగి అకాల మృతి తీరనిలోటు

- జిహెచ్ఎంసి ఔట్సోర్సింగ్ ఉద్యోగి బోర్ర గోపినాథ్ యాదవ్ అకాల మృతి తీరనిలోటు అంటున్న తోటి ఉద్యోగులు, బాల్య స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులు.
- కుటుంబానికి అండగా ఉండి పెద్దదిక్కుగా వ్యవహరించిన కాలనీ పెద్దలు సామ మైపాల్ రెడ్డి, సామ తిరుమల్ రెడ్డి, సామ మల్లారెడ్డి, సామ రాజిరెడ్డి.





✍ **జయభేరి, హైదరాబాద్, జూన్ 29:**

వంతెన బ్యూరో ఇన్చార్జ్ దామెర నాగఫణింద్ర మలక్పేట్ పరిధిలోని పోచమ్మ బస్తి కాలనీకి చెందిన బోర్ర గోపినాథ్ యాదవ్ అతి చిన్న వయసులో కేవలం ముప్పై ఆరేళ్ల వయసులో గుండె పోటుతో చనిపోవడం అత్యంత బాధాకరమైన విషయం అంటున్నారు సాటి ఉద్యోగులు, బాల్య స్నేహితులు.

ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సంతాప సభలో కుటుంబానికి పెద్దదిక్కుగా వ్యవహరించి అండగా నిలిచారు కాలనీ పెద్దలు సామ మైపాల్ రెడ్డి, సామ తిరుమల్ రెడ్డి, సామ మల్లారెడ్డి, సామ రాజిరెడ్డి. కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా భవిష్యత్తులో వారి కుటుంబానికి ఏ అవసరం ఉన్నా తాము ముందుండి వారికి మద్దతుగా ఉంటామని ఈ సందర్భంగా సామ బ్రదర్స్ తెలియజేశారు. గోపినాథ్ యాదవ్ ప్రతి ఒక్కరితో ఎంతో వినమ్రంగ ఉంటూ ఎవరికి ఏ అవసరం ఉన్నా తాను ముందుండి సహాయం చేసేవాడని ఈ సందర్భంగా సామ బ్రదర్స్ తెలియజేశారు. అలాగే అతి చిన్న వయసులో తను కన్ను మూయడం కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా ఎంతో తీరనిలోటు అని వారు పేర్కొన్నారు. యువత దేశానికి వెన్నముక్క లాంటిదని వారిని ఇలాంటి అకాల మృత్యువులు కబళించడం సమాజానికి ఎంతో లోటు చేస్తాయని సామా బ్రదర్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున చిన్ననాటి స్నేహితులు, కాలనీవాసులు, తోటి ఉద్యోగులు మరియు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. గోపినాథ్ యాదవ్ కుటుంబానికి తాము సైతం అండగా నిలుస్తామని బాల్యమిత్రులు తెలియజేయడం స్నేహానికి ఉన్న విలువను చెప్పకనే చెబుతోంది.



## ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

- నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్ స్టేషనరీ, పుస్తకాలు విక్రయాలు నిర్వహిస్తే దాడులు చేస్తాం
- ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ నిఘ కరువు
- బిఆర్ఎస్వి దేవరకొండ మండల అధ్యక్షులు పాత్లావత్ లక్ష్మణ్ నాయక్

✍ **జయభేరి, దేవరకొండ :**

విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు దోపిడీకి పాల్పడుతున్న విద్యాశాఖ అధికారులు తనిఖీలు శూన్యమనీ విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ రంగురంగుల బ్రోచర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తు, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల ముసుగులో ఫీజులు మోత మోగిస్తున్నాయి. గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి ఆయా ఆయా పాఠశాలను సీజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

## మీడియా పై దాడులు సరికాదు

- దాడులు చేసిన వారిని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలి.
- ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆకాష్ నాయక్ డిమాండ్.

✍ **జయభేరి, షాద్ నగర్, జూన్ 29 :**



మీడియా కార్యాలయం పై దాడి సిగ్గుచేటని దాడులు చేసిన వారిని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మహా న్యూస్ కార్యాలయంపై ఘటన ఖండిస్తూ ప్రజా సంఘాలతో కలసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.... మహా న్యూస్ కార్యాలయం పై దాడి అంటే వ్యక్తుల స్వేచ్ఛ పై దాడి చేసినట్లేనని,అలాంటి వారిని ప్రభుత్వం వదిలేపెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని అన్నారు. గత పది ఏళ్ళు తెలంగాణ రాష్ట్రాన్ని ఎలిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ కూడా మీడియాను వార్తలు రాయకుండా అడ్డుకుని,మళ్ళీ అదే దాడులను చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.కార్యాలయం పై దాడికి పాల్పడిన దుండగులను,అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మీడియా కార్యాలయాలపై దాడులు జర్నలిస్టులపై బెదిరింపులు చేయడం చాలా హేయమైన చర్య సిగ్గుచేటు అయిన విషయం ఇది ఇలాంటి వారికి సహకరించే వ్యక్తులను కూడా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

✍ **జయభేరి, మేడిపల్లి :**




మేడిపల్లి ప్రెస్ క్లబ్ పై వ్యక్తులపై సోషల్ మీడియా (వాట్సాప్) లో అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి సీఐ ఆర్. గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి ప్రెస్ క్లబ్ అంతర్గత అంశాలపై సోషల్ మీడియా (వాట్సాప్) నెట్వర్క్ లో దుష్ప్రచారం చేస్తూ పోస్ట్ చేసిన రాజాపేట నవీన్ చారీ అనే వ్యక్తిపై బీఎన్ఎస్ 352 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.అబద్ధాలు, అసత్య ప్రచారాలు చేస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించేలా,ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేకా పోస్ట్‌లు పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని సీఐ గోవింద్ రెడ్డి తెలిపారు.

## జూలై 8 న వైఎస్సార్ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం

✍ **జయభేరి, హైదరాబాద్:**

దివంగత ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్. రాజశేఖర్రెడ్డి జయంతి సందర్భంగా వచ్చే నెల 8వ తేదీన వైఎస్సార్ అభిమానులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వైఎస్సార్సీపీ ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షులు వై. ఈశ్వరప్రసాద్ రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్లోని ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్లో ఆయన వైఎస్సార్ అభిమానులతో కలిసి జూలై 8న నగరంలో నిర్వహించనున్న వైఎస్సార్ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదాపూర్లోని బుట్టా కన్వెన్షన్ సెంటర్లో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని నగరంలో ఉన్న వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. వైఎస్సార్ ఒక యుగ పురుషుడు అని, ప్రతీ పేద గుండె తడిని చూశాడు కాబట్టే మహానేత అయ్యాడని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఏపీ.రెడ్డి, వైఎస్సార్సీపీ ఇంటలెక్చువల్స్ విభాగం ప్రధాన కార్యదర్శి చొక్కం సంజీవయ్య, పి.ఎస్.కష్ణ మోహన్రెడ్డి, డాక్టర్ బీఎంకే.రెడ్డి, వి సురేష్రెడ్డి, బి. మధుసూదన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఒక పార్టీ అధికారం కోసం దేశం స్వేచ్ఛను తాకట్టు పెట్టింది..

# అదే చీకటి అధ్యాయం

■ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్,కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

**జయభేరి, ఎల్బీనగర్, జూన్ 29:**




కాంగ్రెస్ పార్టీ విధించిన అఘాత్యాలని ఎండగడుతూ ఎల్.బి నగర్ నియజకవర్గం,హస్తినాపురం డివిజన్ లో బిజెపి రంగారెడ్డి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన సంవిధాన్ హత్యా దివాస్ BLACK DAY గురించి సదస్సు మరియు ఎక్సబిషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బిజెపి జాతీయ ఓబిసి మోర్చా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు Dr.లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు గంగిడి. మనోహర్ రెడ్డి వారితో కలిసి GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి పాల్గొన్నారు.




ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని తొక్కేసి, ప్రజల హక్కులు కాలరాసి, ప్రజాస్వామ్యవాదులను నిర్బంధించి, కేవలం తన అధికారమే పరమావధిగా ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా... నేటి పౌరులకు నాటి చీకటి రోజుల గురించి తెలుసుకోవాలని అన్నారు. "పార్లమెంట్ అణగదొక్కబడింది.. ప్రజల గొంతు నొక్కేసారు.. ఇదే ఆ విధ్వంసపు స్వరూపం.. ఇది కేవలం చీకటి రోజు కాదు.. ప్రజల స్వేచ్ఛను కబళించిన చరిత్రలో నలుపు కళ్ళెర.. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నిలబడిన ప్రజల పోరాటం.. నేటి తరం తెలుసుకోవాల్సిన నిజం.. పత్రిక స్వేచ్ఛను మూసివేసిన దినం.. ప్రజాస్వామ్య కవచాన్ని చీల్చిన ఘోర దినం.. ఆ రోజు నిశ్శబ్దం.. నేడు అది చరిత్ర. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే దీపం నేటి తరానికి అవసరం.. నలుపు ధరిస్తే నేరమా? కానీ ఆ రోజు దేశం మీద నలుపు వేసిన వారు శాసకులే.. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలనుకున్న వారు స్వయంగా చరిత్రలోనే చెరిపోయారు.."

ఈ కార్యక్రమంలో ఆనాటి చీకటి రోజుల అనుభవించిన ప్రధాన వ్యక్తులు,మాజీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి,మాజీ రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, బిజెపి ఎల్బీనగర్ నియోజకవర్గం కార్పొరేటర్లు, రాష్ట్ర నాయకులు,వివిధ మోర్చాల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు.

---



## నూతన సీసీ రోడ్ ప్రారంభించిన కార్పొరేటర్ కళ్లెం

**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్ లోని పద్మావతి కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ నేడు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసులతో కలసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హయత్ నగర్ డివిజన్ లోని ప్రతి కాలనీ అభివృద్ధి చెయడం తన యొక్క బాధ్యతని, రానున్న రోజుల్లో హయత్ నగర్ డివిజన్ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటానని వారు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు అమర్నాథ్ గౌడ్, యాదిరెడ్డి, రామకృష్ణ, మురళీధర్ రావు, కృష్ణ, చంద్రశేఖర్, జగన్మోహన్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

---

## కార్పొరేటర్ ని కలసిన శాంతివనం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు



**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్లోని శాంతివనం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నేడు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని వారి నివాసంలో కలవడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో ఉన్నటువంటి భూగర్భ డ్రైనేజ్ సమస్యను వివరించగా, కార్పొరేటర్ స్పందించి అధికారులతో సమీక్షించి వీలైనంత త్వరగా కాలనీవాసుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, కాలనీ అధ్యక్షులు వెంకటేశం, Sk రహీం, చంద్రశేఖర్, శ్రీనివాస్, వెంకటరెడ్డి, గోవిందా రెడ్డి, శేఖర్, భరత్, SK జఫర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

---



## నూతన కమిటీకి శుభాకాంక్షలు

■ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, మల్లాపూర్ :**

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గుల్ మోహర్ గార్డెన్స్ లో నూతనంగా ఎన్నికైన కమిటీ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్ రెడ్డిని సన్మానించి, అనంతరం నూతన కమిటీని పరిచయం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుల్ మోహర్ గార్డెన్స్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు, తన దృష్టికి తెచ్చిన పలు వినతులను ఓపెన్ జిమ్, బొర్వెల్, స్పీడ్ బ్రేకర్లు, వీధి దీపాలు, చెట్ల కొమ్మలను తొలగింపు వంటి సమస్యలు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మారుతి, ప్రధాన కార్యదర్శి శశికిరణ్, సాయిచంద్, ప్రవీణ్, రూపేష్, విజయశ్రీ, గాయత్రి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

---

## కరీంనగర్ లో ట్రాఫిక్ రూల్స్ పై పోలీసుల నిఘా

■ అధిక శబ్దం వచ్చే 243 బైక్ ల సైలెన్సర్లను ధ్వంసం చేసిన పోలీసులు

**జయభేరి, కరీంనగర్:**

కరీంనగర్లో ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వారిపై పోలీసులు కొరఢా ఝుళిపిస్తున్నారు. జరిమానా విధించడంతోపాటు కేసులు నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. కరీంనగర్ లో ట్రాఫిక్ రూల్స్ ను పకడ్బందీగా అమలు చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. అధిక శబ్దంతో తిరిగే 243 బైకులను గుర్తించి సైలెన్సర్లను తొలగించి రోడ్డు రోలర్ తో ధ్వంసం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వాహనదారులపై జరిమానాలు విధించడంతోపాటు కేసులు పెడతామని సిపి గౌస్ ఆలం హెచ్చరించారు. ఇకనుంచి కరీంనగర్ లో 750 సీసీటీవీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనల పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్ జంపింగ్, సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్ ఫోన్ ఉపయోగించడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, ర్యాష్ డ్రైవింగ్ వంటి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ట్రాఫిక్ చలాన్లు జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రయోగాత్మకంగా ఒక్కరోజు పరిశీలిస్తేనే 2500 బైక్ లు వాహనాలు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించాయని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించి పోలీసులకు సహకరించాలని సిపి గౌస్ ఆలం కోరారు.

---

## యువకుడిని చికతబాదిన పోలీసులు

■ విచారణకు ఆదేశించిన ఎస్పీ

**జయభేరి, అనంతపురం:**

పెద్దపప్పూరు యువకుడు వంశీని పోలీసులు కొట్టినట్లు వైరల్ అయిన ఘటనపై జిల్లా ఎస్పీ పి.జగదీష్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. సదరు ఆరోపణలపై సమగ్రంగా విచారించి నివేదిక పంపాలని సూచనలు ఇచ్చారు. విచారణ నివేదిక అనంతరం తదనుగుణంగా చర్యలు తీసుకునేలా జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేసారు.

---

# రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

■ ఫైళ్ళ ఆశయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**జయభేరి, మేడిపల్లి :**



మేడిపల్లి మండలం రజక వృత్తిదారుల సంఘం జనరల్ బాడీ సమావేశం ఆదివారం మేడిపల్లిలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ రజక వృత్తిదాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైళ్ళ ఆశయ్య హాజరై మాట్లాడుతూ మేడిపల్లి మండలం అనేక గ్రామాలలో నేటికి రజకులు వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వృత్తిదారులు పేదరికంలో మగ్గుతున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా ప్రభుత్వం రజకులకు మోడరన్ దోబీఘట్లు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వంని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీసీ కార్పొరేషన్ ద్వారా వృత్తిదారులకు రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రజక ఆత్మగౌరవ భవన స్థలాన్ని చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి స్థలాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

రజక ఫెడరేషన్ కు వెంటనే ప్రభుత్వం పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలని, ఉచిత విద్యుత్తు పథకం పెండింగ్ బిల్లులు ప్రభుత్వ వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆశయ్య ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు చౌదరం సుభద్ర, జిల్లా కార్యదర్శి జ్యోతి ఉపేందర్ జిల్లా సహాయ కార్యదర్శి సట్టు రవి, జ్యోతి దుర్గయ్య జిల్లా ఉపాధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య నూతన మండల కమిటీని ప్రకటించారు. మేడిపల్లి మండల రజక వృత్తిదాల సంఘం అధ్యక్షులుగా అంబే చక్రపాణి నియమించారు. ముఖ్య సలహాదారులుగా కలుకూరి ఎల్లయ్య, కమిటీ ఉపాధ్యక్షులు బోడుపల్ బిక్షపతి, పర్వతపూర్ మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అంబే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోరుకంటి నరేందర్, ప్రచార కార్యదర్శిగా అంబే కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి గోరుకంటి కృష్ణ, కార్యదర్శి గుండేపూరి నరేష్, మహిళా కన్వీనర్ దానాల భారతి, ధనలక్ష్మి, అండాలు మరో 20 మంది కార్యవర్గ సభ్యులుగా నూతన మండల కమిటీని ఈ సందర్భంగా ప్రకటించడం జరిగింది.

---

## ఇంజనీరింగ్ విద్యార్థినికి ల్యాప్ టాప్ అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే

**జయభేరి, ఉప్పల్ :**



చిలుక నగర్ డివిజన్ కి చెందిన BRS పార్టీ కార్యకర్త రేణుక ముదిరాజ్ కూతురు సంధ్య సాంస్కృతి ఇంజనీరింగ్ కాలేజ్ లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతుంది.

వారి ఆర్థిక పరిస్థితి బాగాలేక BRS పార్టీ సీనియర్ నాయకులు గుడి మధుసూధన్ రెడ్డి ఆధ్వర్యంలో సంధ్యకి ల్యాప్ టాప్ నీ వారి నివాసానికి వెళ్లి అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తన స్వంత నిధులతో పేద కుటుంబానికి అండగా నిలుస్తున్న గుడి మధుసూధన్ ని అందరూ స్ఫూర్తిగా తీసుకుని సవా కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో చిలుక నగర్ డివిజన్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

## సుభాష్ నగర్ కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

■ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ కాలనీలో 30.50 లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సుభాష్ నగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యేగా ఎన్నికై 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా 100 కొబ్బరి కాయలు కొట్టి తన మొక్కులు తీర్చుకున్నా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సాయిలు, గంగాధర్, తిరుమలయ్య, బలనర్సింహ, పోచయ్య, కృష్ణ, శంకర్, మల్లేష్, ప్రభు, నరేష్, భాను, లలిత, భాగ్య, మీరభాయ్, లక్ష్మీ, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, ఉస్మాన్, అల్లాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

---

## ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం



**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ లోని ఇన్ఫర్మేషన్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి వివిధ కాలనీ వాసులు ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో స్థానిక డివిజన్ కార్పోరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన శ్రీకరా హాస్పిటల్ వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతూ, అదేవిధంగా పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి కాలనీవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల అధ్యక్షులు సత్తు నాగయ్య, గంట శ్రీధర్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్, కృష్ణారెడ్డి, జై భారత్ రెడ్డి, బీజేపీ జిల్లా sc మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్రవెలి సత్యనారాయణ, నాయకులు ఎర్ర శ్రీకాంత్, అరుణ్, బీజేవైఎం అధ్యక్షులు ప్రేమ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

---

## పద్మావతి కాలనీ అభివృద్ధి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

■ స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి




**జయభేరి, ఎల్బీనగర్ :**

బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీలో వీధి దీపాలు, త్రీఫేస్ కరెంట్ , నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మరియు రోడ్లు ఏర్పాటుకు కృషి చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్ కోరడం జరిగింది. స్పందించిన కార్పొరేటర్గారు త్వరలోనే కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్,ప్రసాద్, రామ్మోహన్ రావు, రామయ్య, మధుసూదన్ రెడ్డి, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం.

శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

**పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా**

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి. ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

**శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి**

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

**రాజ్మా పరాఠా, కప్పు పెరుగు**

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

**సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్**

సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

**మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్**

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

**మొలక పెసర్లు ఓట్స్ చీలా**

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.



# ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన రేకుల్ షెడ్లను తొలగించాలి

- తక్షణమే ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనపరచుకోవాలి
- చర్ల మండల సీపీఐ నాయకత్వం తహశీల్దార్ కి వినతి పత్రం

**జయభేరి, చర్ల, జూన్ 29 :**

చర్ల మండలం కేంద్రంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో చర్ల చెక్కులోని 117 సర్వే నెంబర్ లో ఆక్రమణకు గురైన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని రెవిన్యూ వారు స్వాధీన పరుచుకోవాలని శనివారం మండల తహశీల్దార్ కి వినతి పత్రం అందజేసారు.


ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చర్ల మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని, ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాల అవసరాలకు సెంటు భూమి కూడా ఉండే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చర్ల చెక్కులో సర్వేనెంబర్ 117 లో ఉన్న మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది కొన్ని పార్టీల అండదండలతో ఆక్రమించారని, ఆక్రమించిన భూములను ప్లాట్లుగా చేసి అమాయక ప్రజలకు అమ్మకాలు జరుపుతున్నారని అన్నారు. ఎకరాల ఎకరాలు ప్రభుత్వ భూములను ఆక్రమించి, అమ్మకాలు జరుపుతుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎక్కడో ఉన్న పట్టాను చూపిస్తూ ఆక్రమించిన భూములకు పట్టాలు ఉన్నాయని ప్రజలని మభ్యపెడుతున్నారని, ధ్వజమెత్తి ప్రశ్నించిన వారిని ఆక్రమణదారులు బెదిరిస్తూ, ప్రభుత్వ భూములు వారి సొత్తుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ దుర్మార్గాలకు ఒక పార్టీ అండగా ఉండడం బాధాకరమన్నారు. తక్షణమే ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీన పరచుకోవాలని, ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమిలో నిర్మించిన రేకుల షెడ్లను, ఫెన్సింగ్ లను తొలగించాలన్నారు. అక్కడి ప్రభుత్వ భూమిలో రెవెన్యూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. లేనియెడల భవిష్యత్తులో ప్రజలని ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం చర్ల తహసిల్దార్ కి వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా చర్ల తాసిల్దార్ మాట్లాడుతూ వారం రోజుల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీన పరుచుకుంటామని, ఇకమీదట ఎవరు ప్రభుత్వ భూమిని ఆక్రమించకుండా కఠిన చర్యలు చేపడతామని తహసిల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నాయకులు అడ్డగర్ల తాతాజీ, కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ, కల్లూరి సీతారాములు, ఉప్పులూరు వెంకట నరసమ్మ, బీఎస్పీ సీనియర్ నాయకులు కొండా చరణ్, గోగీకార్ రామ్ లక్ష్మణ్, సామల ప్రవీణ్, చెన్నా మోహన్, కొండా కౌశిక్, గుర్రాల విజయ్ కుమార్ పాల్గొన్నారు.





# రియల్ ఆపడం ఎవరి తరం...



**జయభేరి, హైదరాబాద్, జూన్ 29:**

హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగానికి ఎప్పటికీ కొదవలేదు. ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్టులు ఊరిస్తుంటాయి. హైదరాబాద్ నగరం పెరగటమే కాని, నగరంలో రియల్ ఎస్టేట్ తగ్గిన కాలం అస్సలు లేదనే చెప్పాలి. 1990వ దశకం నుంచి ప్రారంభమయిన ఈ ఉధృతి అలాగే కొనసాగుతుంది. పాలకులు, వారి పాలసీలతో సంబంధం లేకుండా పెరిగే ఏకైక నగరం హైదరాబాద్ మాత్రమే. బెంగళూరుకు మించి హైదరాబాద్ నగరం విస్తరించింది. అందుకే మౌలిక సదుపాయాల కల్పనలో ఏ ప్రభుత్వమయినా కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తుంది. ఇక మంచి వెదర్ తో పాటు కాస్మోపాలిటన్ సిటీగా మారడం, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నగరం హైదరాబాద్ మాత్రమే. అందుకే ఏ ప్రభుత్వం వచ్చినా హైదరాబాద్ నగరం విస్తరణకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. పాలసీలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. అందరికీ తాగు నీటిని అందించేలా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక మెట్రో రైలు, ఫ్లైఓవర్లతో ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫోర్త్ సిటీని కూడా అభివృద్ధి చేయడం ప్రారంభించింది. తాజాగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో నియో పొలిస్ మరో భారీ ప్రాజెక్టును నిర్మిస్తుంది.

దీని విలువ 3,169 కోట్ల రూపాయలుగా అంచానా. దీనికి కాస్ కేడ్స్ నియోపోలిస్ పేరుతో నిర్మిస్తున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. మొత్తం ఐదు బ్లాక్ లలో ఆరు అంతస్తులను నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. మొత్తం 1,189 ఫ్లాట్లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది. చదరపు గజం పది వేల రూపాయలుగా చెబుతోంది. ఇక అదనంగా పార్కింగ్, ఇతర సదుపాయాల కోసం అదనపు మొత్తాన్ని వసూలు చేస్తారు. దీంతో పాటు ట్రంప్ సంస్థ నిర్మించే మరో భవనాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ లో ట్రంప్ టవర్ అందుబాటులోకి వస్తే నగరం రూపురేఖలే మారనున్నాయి. అత్యంత ఎత్తైన ఈ టవర్ల నిర్మాణపనులు ప్రారంభ కానున్నాయి కోకాపేట్ లో నిర్మాణమయ్యే ట్రంప్ టవర్ కూడా ఏర్పాటయితే ఇక హైదరాబాద్ అభివృద్ధిని ఎవరూ అపలేరన్నది వాస్తవం. . కోకాపేట్ లోని నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ట్రంప్ టవర్స్ ను నిర్మించనున్నారు. వీటిని ట్రిబెకా డెవలెపర్స్ నిర్మిస్తున్నట్లు ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగంలో జోరుగా ప్రచారం జరుగుతుంది. ట్రంప్ టవర్స్ అంచనా వ్యయం మూడు వేల ఐదు వందల కోట్ల రూపాయలు అని చెబుతున్నారు. మొత్తం నాలుగు వందల వరకూ లగ్జరీ ఫ్లాట్లను నిర్మించనున్నారు.

ఒక్కొక్క ఫ్లాట్ ధర ఐదు కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని ప్రాథమిక అంచనా. ... ఇక మధ్యతరగతి ప్రజల కోసం కూడా అనేక అపార్ట్ మెంట్లు నగరానికి నాలుగువైపులా నిర్మాణమవుతున్నాయి. ఇటు మేడ్చల్, హయత్ నగర్, సాగర్ రోడ్డులో చాలా వరకూ నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణం చేయతలపెట్టిన ఫోర్త్ సిటీలో కూడా భూముల ధరలు పెరిగాయి. ఎంతగా అంటే ఇప్పుడు అక్కడ సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేనంతగా పెరిగిపోయాయి. అక్కడకు మెట్రో రైలు ప్రతిపాదనను కూడా ప్రభుత్వం సిద్ధం చేస్తుంది. అది పూర్తయిందంటే అక్కడ కూడా అభివృద్ధిని ఆపడం ఎవరి తరమూ కాదు. ఇటు ధనిక, అటు మధ్యతరగతి ప్రజలకు అనుగుణంగా నివాస భవనాలు రెడీ టూ ఆక్యూపైకి సిద్ధంగా ఉండటంతో హైదరాబాద్ మరో ఏడాదిలో మరో పది లక్షల జనాభా పెరుగుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.







# వివాహేతర సంబంధం వివస్త్రను చేసి దాడి

**జయభేరి, వరంగల్, జూన్ 29:**

వివాహేతర సంబంధాలు ఇద్దరి జీవితాలను కాదు, కొన్ని కుటుంబాలను నాశనం చేస్తున్నాయి. కొన్ని సందర్భాలలో ప్రాణాలు సైతం తీస్తున్న ఘటనలు గత కొన్ని రోజులుగా పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో హనుమకొండ జిల్లాలో సభ్యసమాజం తలదించుకునే ఘటన జరిగింది. వివాహేతర సంబంధం పెట్టుకున్న కారణంగా ఓ మహిళను వివస్త్రను చేసి దాడి చేయడంతో పాటు ప్రైవేట్ భాగాల్లో జీడిపోసి హింసించారు.వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కారణంతో వివాహిత పై దాడి చేసి వివస్త్రను చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో ఐదు రోజుల క్రితం ఓ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ వివాహితను ఆమె బంధువులు చెట్టుకు కట్టేసి కొట్టారు. అంతటితో ఆగకుండా ఆమె వివస్త్రను చేసి దాడి చేశారు. అయినా శాంతించని మహిళ బంధువులు జననాంగాల్లో జీడిపోసి చిత్రహింసలకు గురిచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడి చేసిన వివరాలు సేకరిస్తున్నారు.తాటికాయల గ్రామానికి చెందిన ఓ యువతికి పదేళ్ల క్రితం ములుగు మండలం బోలోనిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. అతడికి సమీప బంధువైన ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకొని, కొన్నిరోజుల కిందట ఆ మహిళతో కలిసి వెళ్లిపోయారు. తన భర్త వేరే మహిళతో వెళ్లిన విషయాన్ని స్వగ్రామమైన తాటికాయలకు వచ్చి మహిళ తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ఆ మహిళ తల్లిదండ్రులు, బంధువుల చుట్టుపక్కల గాలించారు. పారిపోయిన ఇద్దరిని వెతికి ఐదు రోజుల క్రితం తాటికాయల గ్రామానికి తీసుకొచ్చి వారిపై దాడి చేశారు. ఇలాంటి పనులు చేస్తే మా పరువు ఏమవుతుందని, కూతురి జీవితం నాశనం అవుతుందంటూ ఇద్దరిని కొట్టారు. తన భర్తతో వివాహేతర సంబందం పెట్టుకున్న మహిళపై దాడి చేసి ఏం మందు పెట్టావు అంటూ వివస్త్రను చేశారు. అనంతరం ఇద్దరికి గుండు గీయించారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ వద్దని వేడుకుంటున్నా ఆమెను వివస్త్రను చేసి జననాంగాల్లో జీడి పోసి చిత్రహింసలు పెట్టారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ తరువాత నుంచి దాడికి గురైన ఇద్దరు ఆచూకీ లేదని సమాచారం.








## దిల్ రాజు భార్య పెద్ద చదువులే చదివింది..

దిల్ రాజు ఇండస్ట్రీలో టాప్ ప్రొడ్యూసర్స్‌లో ఒకరు అనే విషయం తెలిసిందే. ఆయన పెద్ద హీరోలతో సినిమాలు చేస్తూ ఇండస్ట్రీకి మంచి హిట్స్ అందించాడు. ఇటీవల దిల్ రాజు డ్రీమ్స్ అనే వెబ్ సైట్‌ని లాంచ్ చేశారు. పరిశ్రమకు పరిచయం కావాలనుకునేవారికి ఇది సరైన వేదిక అవుతుందనే ఆలోచనతో ఈ 'దిల్‌రాజు డ్రీమ్స్' అనే వెబ్‌సైట్‌ని స్టార్ట్ చేశాం అని దిల్‌రాజు తెలిపారు. అయితే దిల్ రాజు పర్సనల్ లైఫ్ ఒకసారి చూస్తే అతని భార్య అనిత కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో కన్నుమూసింది. కొద్ది రోజుల తర్వాత తేజస్విని అనే యువతిని వివాహం చేసుకున్నాడు. ఇటీవల ఆమె సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ హాట్ టాపిక్‌గా మారుతుంది. దిల్ రాజు భార్య తేజస్విని గతంతో పోల్చితే తన వ్యక్తిగత జీవితంలోనూ, వృత్తిపరమైన విషయాల్లోనూ ఓపెన్‌గా మాట్లాడుతూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా మారింది. ఇటీవల భర్తతో కలిసి పారిస్‌కి వెకేషన్‌కి వెళ్లిన సందర్భంగా అక్కడి ఫోటోలు తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసి నెటిజన్లను ఆకట్టుకుంది.ఇదిలా ఉండగా, పెళ్లి తర్వాత తొలిసారి ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తేజస్విని తన చదువు, కెరీర్, ప్రేమ, పెళ్లి వంటి ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకుంది. "హైదరాబాద్‌లో పుట్టి పెరిగాను. నా విద్యాభ్యాసం మొత్తం గర్ల్స్ ఇన్‌స్టిట్యూషన్స్‌లోనే సాగింది. స్ప్రింగ్ ఫీల్డ్ సెయింట్ ఆన్స్‌లో, ఇంటర్ శ్రీ చైతన్యలో పూర్తయ్యింది. డిగ్రీను కస్తూరిబా గాంధీ కళాశాలలో చేసి, నాచారంలోని సెయింట్ పియస్ కళాశాలలో బయోకెమిస్ట్రీలో పీజీ పూర్తిచేశాను. మా అమ్మ హైకోర్ట్ అడ్వకేట్. ఆమెను చూసి నాకూ కూడా లా పట్ల ఆసక్తి వచ్చింది. అందుకే పీజీ తర్వాత పెండెకంటి లా కాలేజీలో లా చదవడం ప్రారంభించాను. ఆ సమయంలోనే దిల్ రాజు గారితో వివాహం జరిగింది. పెళ్లి తర్వాత కూడా చదువుతూనే 2024లో లా పూర్తి చేశాను. నేనొక మంచి స్టూడెంట్ అని గర్వంగా చెప్పగలను అని తేజస్విని చెప్పారు. కేవలం చదువు మాత్రమే కాదు, తేజస్వినికి కళలపై కూడా మంచి పట్టు ఉంది. ముఖ్యంగా క్లాసికల్ డ్యాన్స్‌లో ప్రావీణ్యం కలిగి ఉండి, పలు స్టేజ్ పర్ఫార్మెన్సులు కూడా ఇచ్చింది.

## ఏళ్లనాటి శని పోయింది..
### కన్యారాశి టైమ్ వచ్చింది..




యువతను విశేషంగా ఆకట్టుకున్న సినిమా 'ఈ నగరానికి ఏమైంది?'. ఈ సినిమా సీక్వెల్ కోసం సినీప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో.. ఎట్టకేలకు సీక్వెల్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. 'ENE రిపీట్' టైటిల్‌తో సీక్వెల్‌ని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఫస్ట్ పార్ట్‌లో నటించిన విశ్వక్‌సేన్, సాయిసుశాంత్‌రెడ్డి, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను ఈ సీక్వెల్‌లో కూడా హంగామా చేయనున్నారు. ఒరిజినల్‌ని క్రియేట్ చేసిన తరుణ్‌భాస్కర్ ఈ సీక్వెల్‌ని కూడా తెరకెక్కించబోతున్నారు. డి.సురేశ్‌బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మాతలు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో 'ఏళ్లనాటి శని పోయింది.. కన్యారాశి టైమ్ వచ్చింది..' అనే ట్యాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నది. గాలిలో ఎగిరిపోతున్న బట్టలు, బ్రీఫ్‌కేస్, బీర్ బాటిళ్లు, సన్ గ్లాసెస్, విమాన టికెట్ ఇవన్నీ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: ఏ.జె.ఆరోన్, సంగీతం: వివేక్ సాగర్.



## ఒక్కో మూవీకి 40 కోట్లు..

సినిమా ఇండస్ట్రీలో హీరోలతో పోల్చితే హీరోయిన్ల రెమ్యునరేషన్లు చాలా తక్కువ. బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్లుగా చెలామణి అవుతోన్న దీపికా పదుకునే, అలియా భట్, కరీనా కపూర్, కత్రినా కైఫ్, కియారా అద్వానీ తదితరులు కూడా 20 కోట్లకు పైగా రెమ్యునరేషన్లు తీసుకుంటున్నారు. ఇక దక్షిణాదిలో నయనతార, రష్మిక మందన్నా, త్రిష, సమంత లాంటి క్రేజీ హీరోయిన్లు ఒక్కో సినిమాకు రూ. 10 కోట్లు తీసుకుంటున్నారు. హాలీవుడ్ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఇంటర్నేషనల్ ఈవెంట్ల తో గ్లోబల్ బ్యూటీగా గుర్తింపు తెచ్చుకుంది ముద్దుగుమ్మ, త్వరలోనే తెలుగు ఆడియెన్స్ ను కూడా పలకరించేందుకు రెడీ అవుతోంది. సూపర్ స్టార్ మహేష్ బాబు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలో ఈ అందాల తారనే హీరోయిన్ గా ఎంపికైంది. ఈ పాటికే చాలా మందికి అర్థమై ఉంటుంది.. మనం ఎవరి గురించి మాట్లాడుకుంటున్నామో? యస్. తను మరెవరో కాదు ప్రియాంక చోప్రా. మహేష్ బాబు రాజమౌళి సినిమా కోసం ప్రియాంక చోప్రా రూ. 30 కోట్ల పారితోషికం తీసుకుంటోందని తెలుస్తోంది. అయతే గతంలో సిటాడెల్ కోసం ప్రియాంక చోప్రా సుమారు $5 మిలియన్లు అంటే దాదాపు రూ. 41 కోట్లకు పైగా రెమ్యునరేషన్ అందుకున్నట్లు సమాచారం. అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ కు వచ్చిన ఆ వెబ్ సిరీస్ మొత్తం రన్‌టైమ్ 6 గంటలు ఉంది. అదే క్రమంలో ప్రియాంకకు చెల్లించిన మొత్తం చాలా పెద్దది. ఇక ఈ ముద్దుగుమ్మకు ఇప్పటివరకు రూ. 700 కోట్లకు పైగా ఆస్తులున్నట్లు తెలుస్తోంది. అలాగే ఆమె భర్త, ప్రముఖ అమెరికన్ సింగర్ నిక్ జోనస్ నెట్‌వర్త్ సుమారు రూ. 666 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. అలా వీరిద్దరి ఆస్తులు కలుపుకుని 1300 కోట్ల వరకూ ఉంటాయని తెలుస్తోంది.



## మళ్లీ డాక్టర్‌గా మారిన హీరోయిన్..

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో పుట్టి పెరిగిందీ అందాల తార. చిన్నప్పటి నుంచే చదువులో చురుకుగా ఉండడంతో తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించారు. ఇదే క్రమంలో మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ లోని ప్రవర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ లో మెడిసిన్ పూర్తి చేసింది. అన్నట్లు ఈ నటి జాతీయస్థాయి అథ్లెట్. కోకో, బ్యాడ్మింటన్ క్రీడల్లో బంగారు పతకాల కూడా గెల్చుకుంది. అంతేకాదు క్లాసికల్ నృత్య కళాకారిణి కూడా. మెడిసిన్ పూర్తయ్యాక న్యూయార్క్ వెళ్లి మాస్టర్స్ కూడా పూర్తి చేద్దామనుకుంది. అదే సమయంలో అనుకోకుండా సినిమా ఛాన్స్ వచ్చింది. దీంతో మాస్టర్స్ అప్లికేషన్ కూడా చింపేసి ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. హీరోయిన్ గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు పలు టీవీ షోల్లోనూ సందడి చేస్తోంది. ఇటీవలే నాని నటించిన బ్లాక్ బస్టర్ మూవీ హిట్3 లోనూ ఎస్పీ వర్షా గా ఓ కీలక పాత్ర పోషించి ప్రశంసలు అందుకుంది. ఈ పాటికే అర్థమై ఉంటుంది మనం ఎవరి గురించి మాట్లాడుకుంటున్నామో? యస్. తను మరెవరో కాదు కోమలి ప్రసాద్. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉండే కోమలి ప్రసాద్ లేటెస్ట్ గా తన ఇన్ స్టా గ్రామ్ లో ఒక ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. వైట్ కోట్ ధరించి డెంటిస్ట్ గా మారినట్టు ఫొటోలు షేర్ చేస్తూ..' అందరూ స్వచ్ఛమైన స్మైల్ ఇవ్వడానికి సిద్ధంగా ఉండండి.. త్వరలోనే డాక్టర్ కోమలి ప్రసాద్ రాబోతోంది' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. కోమలి ప్రసాద్ పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారింది. ఈ పోస్ట్ ద్వారా డెంటిస్ట్ గా ప్రాక్టీస్ మొదలు పెట్టినట్లు కోమలి ప్రసాద్ స్పష్టం చేసింది. 2016లో సీతాదేవి సినిమాలో ఎంట్రీ ఇచ్చింది కోమలి ప్రసాద్. ఆ తర్వాత నెపోలియన్, అనుకున్నది ఒకటి అయినది మరొకటి, రౌడీ బాయ్స్, సెబాస్టియన్ పీసీ 524, హిట్2, హిట్3 తదితర హిట్ సినిమాల్లో నటించి మెప్పించింది. కొన్ని తమిళ సినిమాల్లోనూ తళుక్కుమంది.

## బిగ్ బాస్ నుండి మరో ప్రోమో విడుదల..






మరి కొద్ది రోజులలో తెలుగులో బిగ్ బాస్ సీజన్ 9 ప్రారంభం కానుంది. ఎప్పుడా ఎన్నడా అంటూ ఎదురు చూస్తున్న అభిమానులకి షోపై మరింత ఆసక్తి కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. మళ్లీ కింగ్ నాగార్జున హోస్ట్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఈ షోకు సంబంధించిన ప్రోమో ఇప్పటికే ఒకటి విడుదల కాగా, తాజాగా నాగ్ మరో భారీ అప్‌డేట్‌తో అందరిని ఆశ్చర్యపరిచారు. ఇప్పటివరకూ సెలబ్రిటీలు, టీవీ ఆర్టిస్టులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకే ఈ హౌస్‌లోకి ఎంట్రీ లభించేది. కానీ ఈ సారి మాత్రం బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. సాధారణ ప్రజలకు కూడా అవకాశం ఇవ్వబోతున్నట్టు షో నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఈ అవకాశాన్ని అందుకోవాలంటే bb9.jiostar.com వెబ్‌సైట్‌లో రిజిస్టర్ కావాలి. పేరుతో పాటు మొబైల్ నంబర్ వెరిఫై చేసిన తర్వాత, "మీరు బిగ్ బాస్ హౌస్‌లోకి ఎందుకు రావాలనుకుంటున్నారు?" అనే విషయాన్ని వీడియో రూపంలో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. షార్ట్‌లిస్ట్ అయిన వారికి సెలెక్షన్ ఛాన్స్ ఉంది. ఈ విషయంపై నాగార్జున మాట్లాడుతూ, "ఇప్పటివరకు మీరు బిగ్ బాస్‌ను ఎంతగా ప్రేమించారు! ఆ ప్రేమకి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలనిపించింది. ఈసారి సెలబ్రిటీలు మాత్రమే కాదు... మీరు కూడా బిగ్ బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టే ఛాన్స్ ఉంది. తలుపులు తెరచి మీ కోసం ఎదురు చూస్తున్నాయి... రండి!" అంటూ వెల్లడించారు. ఆయన చెప్పిన ఈ మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇటీవల విడుదలైన ప్రోమోలో నాగార్జున మాట్లాడుతూ, "ఆటలో అలసిపోయినవారికి గెలుపు సాధ్యం కాదు. ఇది చదరంగం కాదు... రణరంగం!" అంటూ బిగ్ బాస్ 9పై ఆసక్తి పెంచారు. గతంలో బాలకృష్ణ లేదంటే విజయ్ దేవరకొండ హోస్ట్ చేస్తారనే వార్తలు వచ్చినా, చివరికి నాగార్జునే మళ్లీ ఈ సీజన్‌ని హోస్ట్ చేయబోతున్నారు. ఈ సీజన్ కోసం ఇప్పటికే పలువురు టీవీ యాక్టర్లు, సినిమా స్టార్స్, పాపులర్ సోషల్ మీడియా ఫిగర్స్‌కు అవకాశం దక్కినట్టు తెలుస్తుంది. ఒప్పందాలు ఖరారైన తర్వాత అధికారిక లిస్టు రాబోతోందని తెలుస్తోంది. ఇప్పుడు సామాన్యులకు కూడా చోటు లభించబోతుండటంతో ఈ సీజన్ మరింత ఇంట్రెస్టింగ్‌గా సాగే సూచనలు కనిపిస్తున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com